క్లుప్తంగా

మరో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

కొడంగల్ రూరల్: కొడంగల్‌లో మరో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయాదవ్, జి.రమేష్‌బాబు, ఆసిఫ్‌ఖాన్, ఎం.శంకర్ నాయక్, తలారి శేఖర్, ఇందనూర్ బషీర్, ఎస్‌బి.గుల్షన్ తదితరులు పాల్గొన్నారు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి



విటమిన్ల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ గాయత్రి తదితరులు

తాండూరు రూరల్: ప్రతీరోజు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం గోట్లపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్లో మంగళవారం విటమిన్ల ప్రదర్శన నిర్వహించి అవి శరీరానికి ఏవిధంగా ఉపయోగపడుతాయోనని అవగాహన కల్పించారు. పదోతరగతి జీవశాస్త్రం పాఠ్యాంశంలో విటమిన్లకు సంబంధించిన అన్ని వనరులను వారి గ్రామాల్లో విద్యార్థులు సేకరించారు. అనంతరం పాఠశాలలో విటమిన్లు ఏబీసీడీ..గా నిలబడి వాటికి కావాల్సిన వనరులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర అధ్యాపకుడు కృష్ణారెడ్డి, పాఠశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించాలి

పీడీఎస్‌యూ ఏరియా అధ్యక్షుడు శ్రీహరి



ఎంఈఓ రాంరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కొడంగల్ రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో భారీగా ఉన్న ఫీజులను నియంత్రించాలని పీడీఎస్‌యూ ఏరియా అధ్యక్షుడు శ్రీహరి డిమాండ్ చేశారు. మంగళవారం మండల విద్యా వనరుల కార్యాలయ ఆవరణలో ఎంఈఓ రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటై 20నెలలు గడుస్తున్నా ఫీజులను నియంత్రించడంలో విఫలమైందన్నారు. విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల నుంచి విచ్చలవిడిగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అంజి, వెంకట్రామ్ రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధుల మంజూరు



పట్నం మహేందర్‌రెడ్డికి వినతిప్రతం అందజేస్తున్న గాజీపూర్ గ్రామస్తులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో చెన్నకేశవ ఆలయాభివృద్ధికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గాజీపూర్ గ్రామస్తులు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ..ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మంజూరు చేసిన నిధులతో ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీరోడ్డు నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, నసీరోద్దీన్, మహిపాల్‌రెడ్డి, రవికుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బిచ్చన్న, వెంకటయ్యలు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం

- పోటీచేసే స్థానాలపై ప్రణాళికలు
- ముందుగానే ప్రసన్నం చేసుకుంటున్న నాయకులు



నర్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక తొలిసారి చేపట్టనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యాచరణ సిద్ధమవుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్థానిక సంస్థల ఎన్నికలపై బహిరంగంగా మాట్లాడడంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తుంది. ఈ క్రమంలో వచ్చే సెప్టెంబర్‌లోపు నిర్వహించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు నాయకులు క్షేత్రస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రభుత్వ పథకాల్లో వేగిరం..

కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో సానుకూలతను పెంచేందుకు ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో లబ్ధిదారులతో ముగ్గులు పోయిస్తూ సంబంధిత ప్రొసీడింగ్స్ కూడా అందజేస్తున్నారు. దీంతో ఆయా నిర్మాణదారులు కూడా అధికారులు సూచించిన విధంగా శరవేగంగా పనులు చేపడుతున్నారు. మరోవైపు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందజేశారు. భూభారతి అమలు చేసి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూలతను పెంచుతూ వచ్చే పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్, ఎన్నికల్లో విజయం సాధించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. అంతేకాక కిందిస్థాయి నేతలను ఉత్సాహపరుస్తూ అందుకనుగుణంగా నాయకులను సన్నద్ధం చేసుకుంటూ పార్టీలోని పదవులను భర్తీ చేస్తున్నారు.

బెర్త్ ఖరార్ చేసుకుంటున్న నాయకులు

రిజర్వేషన్ తేలకముందే ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు నాయకులు తమతమ బెర్త్ ఖరార్ చేసుకుంటున్నారు. తాము బరిలో ఉంటామనే సంకేతాలు ఇస్తున్నారు. జనరల్, మహిళా, ఎస్సీ, ఎస్టీ విభాగాల్లో ఆయా నాయకులు ఇప్పటికే ప్రజాక్షేత్రంలో ఉంటున్నారు. ఇక రిజర్వేషన్లు ఉన్నవారు తమకు అనుకూలంగా ఉన్న చోట్ల బరిలో ఉంటామని బహిరంగంగానే సంకేతాలు ఇస్తున్నారు. అయితే రిజర్వేషన్లు తేలాక ముందు పంచాయతీ నిర్వహిస్తారా? లేక పరిషత్ ఎన్నికలా? అనే స్పష్టత కోసం ఎదురు చూస్తున్నారు. ఇంకా కొందరు ఏ పార్టీ నుంచి ఉండకుండా తటస్థంగా ఉంటూ సమయాన్ని బట్టి పార్టీ మద్దతు కోరే యోచనలో ఉన్నారు. మండలంలో మొత్తం 33 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో మొత్తం 43,868 మంది ఓటర్లు ఉన్నారు. 21,490 పురుషులు, 22,374 మంది మహిళ ఓటర్లు ఉన్నారు.

లబ్ధిదారులకు ప్లాట్ల పంపిణీ చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

యాలాల: మండల కేంద్రంలో గతంలో కేటాయించిన ప్లాట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని యాలాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కో ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులతో కలిసి తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ..మండల కేంద్రంలో సర్వే నంబర్ 289, 220లో 130 మంది వివిధ వర్గాలకు చెందిన వారికి 75 గజాల ప్లాట్లను కేటాయించినట్లు తెలిపారు. వారికి కేటాయించిన ప్లాట్ల పంపిణీ నేటికి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులు స్పందించి బాధిత లబ్ధిదారులకు వెంటనే ప్లాట్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాగయ్య, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

కేవీపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాండూరు రూరల్: వికారాబాద్ పట్టణంలో ఈ నెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్)శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఉప్పరి మల్కయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ..అధికారంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తోందన్నారు. నిరుద్యోగ దళితులకు రూ.12 లక్షల రుణం అందజేస్తామని ఇచ్చిన హామీని నేరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. నాణ్యమైన విద్యా, వైద్యం అందరికి ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో వికారాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేవీపీఎస్ తాండూరు ఇన్‌చార్జి బ్యాగరి మొగులప్ప నాయకులు శానప్ప, వెంకటేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణను పూర్తి చేయించండి

కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



పాడైన రోడ్డును చూపిస్తున్న నాయకులు

యాలాల: మండలంలోని కమాల్‌పూర్ నుంచి పగిడియాల వరకు అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు వెడల్పు పనులను వెంటనే పూర్తి చేయించాలని కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..అసంపూర్తి రోడ్డుతో వర్షా కాలంలో నిలిచిన వరదనీటితో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ రోడ్ల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి, స్పీకర్, ఎమ్మెల్యే ఈ విషయంలో స్పందించి రోడ్డు వెడల్పు పనులు తక్షణమే పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, నాయకులు రవికుమార్, పాషా, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్కేపల్లిలో ఆత్మీయ సమ్మేళనం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారని హెచ్‌ఎం జ్యోతి పరమేశ్వరి తెలిపారు. అనంతరం శ్రీబలభీమా న్యూస్ ఛానెల్, మాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో విద్యార్థులకు ఉచితంగా బూట్లు, టై, బెల్టు, బ్యాగులు, పలకలు, సీసీ కెమెరాలు, పరేడ్ డ్రమ్ములు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వక్త భాస్కరయోగి, డీఈఓ, డీఎఫ్ఓ, టీవీవీ నాయకులు, ఎంఈఓ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఐకేపీ, మహిళా సంఘాలు, యువజన సంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు.

ఘనంగా రమేశ్‌కుమార్ జన్మదిన వేడుకలు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బసంత్ ఫంక్షన్ హాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రముఖుల మధ్య జరుపుకున్నారు. వికారాబాద్ పర్యటనలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆయన నివాసానికి వెళ్లి శాలువా కప్పి సన్మానించి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ దంపతులు స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

తాండూరు రూరల్: మండల పరిధిలోని చింతమణిపట్నం ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి మైక్‌సెట్ అందజేశారు. మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సునీత, పంచాయతీ కార్యదర్శి శివాజీరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి తహసీల్దార్‌పై వేటు

ప్రజా సంఘాల నాయకుల సంబరాలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంబరాలు చేసుకుంటున్న ప్రజా సంఘాల నాయకులు

పరిగి: పరిగి తహసీల్దార్ అక్రమంగా ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేశారని ప్రజాసంఘాల నాయకులు ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో బదిలీ వేటు పడింది. మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్లు తినిపిస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ ప్రజా సంఘాల పోరాటంతోనే ఉన్నత అధికారులు తహసీల్దార్‌పై వేటు వేశారన్నారు. ప్రజా సంఘాల పోరాట ఫలితంగానే తహసీల్దార్‌పై వేటు పడిందన్నారు. ఎవరైనా సరే రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్‌నాయక్, సత్తయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి ప్రోత్సాహం



టై, బెల్టులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్థానిక నాయకులు కొండ ఆంజనేయులు ఆధర్యంలో టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల సౌకర్యార్థం టై, బెల్టులు అందజేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్‌కుమార్, బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు మైపాల్, నాయకులు కృష్ణయ్య, భీమన్న, వెంకటయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



కుల్కచర్ల: చాకల్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

- మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి
- లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్ అందజేత

పరిగి: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోల్కంపల్లి, పేటమాదారం, మాదారం, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రొసీడింగ్‌లను అందజేసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరీం, ఏ బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆయూబ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, రాంచందర్, తౌరియానాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్లాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చాకల్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ప్రజలు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనను నేటి కాంగ్రెస్ పరిపాలనను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, స్థానిక నాయకులు శేఖర్, చంద్రశేఖర్, శంకర్ నాయక్, రాజేందర్ రెడ్డి, రాము, విజయ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు చర్యలు



దౌల్తాబాద్: శిబిరంలో వైద్య సిబ్బంది



కుల్కచర్ల: పుట్టపహాడ్ గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్‌లో పాల్గొన్న అధికారులు

పీహెచ్‌సీ వైద్యాధికారి అమూల్య

దౌల్తాబాద్: క్షయ నిర్మూలనకు ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి అమూల్య పేర్కొన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం బాలంపేట గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి ఉన్న వారికి జ్వరం, దగ్గు, నీరసం బరువుతగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు తప్పకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలు చేయగా 18 మంది అనుమానితులుగా గుర్తించారు. వారికి పరీక్షల అనంతరం అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మంజుల, రాహత్ సూపర్‌వైజర్ రఫీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకమైన చికిత్స ద్వారా..

కుల్కచర్ల: ప్రత్యేకమైన చికిత్స ద్వారా టీబీ నిర్మూలించవచ్చని కుల్కచర్ల మండల వైద్యాధికారి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపహడ్ గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుభ్రతను పాటిస్తూ మెరుగైన వైద్య చికిత్సలతో నయంచేయొచ్చన్నారు. ఈ వ్యాధి పట్ల ఎవరూ కూడా భయాందోళనకు గురవ్వొదన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మండల ప్రజలకు అవసరమైన వైద్యసదుపాయాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి రవీంద్ర యాదవ్, మనీష్ రెడ్డి, హెల్త్ విజిటర్ రాజు, గోపాల్, వెంకటమ్మ పాల్గొన్నారు.

సంబరాలను విజయవంతం చేయాలి

ఎంపీడీఓ రాములు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములు

బంట్వారం: ఇందిరా మహిళా శక్తి సంబరాలు విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాములు అన్నారు. మంగళవారం బంట్వారం మహిళా సమాఖ్య భవనంలో సంబరాలపై మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు తదితర పథకాలపై గ్రామ సంఘాలు సంబరాలు నిర్వహించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ నెల 15వరకు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దేవయ్య, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు భ్రమరాంబ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ నందు



పోతులవాగు కబ్జా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నందు

ధారూరు: అల్లాపూర్ గ్రామ శివారులోని పోతులవాగును కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ వడ్ల నందు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పోతులవాగును సందర్శించి మాట్లాడుతూ వాగుతో పాటు ఫారెస్టు, రెవెన్యూ భూములను కబ్జాచేశారని, కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వ రోడ్డును దున్నేశారన్నారు. కబ్జాదారులపై వాల్టా చట్టంపై కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ రైతు బాంధవుడు



పరిగి: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యాదయ్య తదితరులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు యాదయ్య
- ఘనంగా వైఎస్సార్ జయంతి

పరిగి: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు బాంధవుడని, రైతు పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోళ్ల యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా కాంగ్రెస్, వైఎస్‌ఆర్‌సీపీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి

అనంతగిరి: వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ అభిమాని, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పరితపించే నాయకుడని అన్నారు. ఆయన సీఎంగా చేసిన అభివృద్ధి పనులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దర్శన్‌గౌడ్, పాండురంగారెడ్డి, కృష్ణ, వెంకట్‌రెడ్డి, బందయ్య తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: వైఎస్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తాండూరు: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరులో..

తాండూరు: మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాలతో పాటు మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వెంకన్నగౌడ్, నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బాతుల వెంకటేష్, వడ్డె శ్రీనివాస్, ఫరీద్, అన్వర్‌ఖాన్, లియాఖత్‌అలీ పాల్గొన్నారు.